
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# అమ్మా! మనింట్లో వంట చేయవూ!!!!

అలారం మోతకి బద్ధకంగా కళ్ళు విప్పింది కుమారి. కళ్ళల్లో ఇసక వేసినట్టు గరగమంటూ మంట పెడుతున్నాయి. పక్కకి ఒత్తిగిల్లింది, మరొక అరగంట పడుకోవాలని ఉందామెకి, కానీ కుదరదు. లేచి నీళ్ళు పట్టుకోవాలి. పిల్లలకేదైనా చేసి పెట్టి పనికి పరిగెత్తాలి. నిన్నటినించీ నడుము విపరీతంగా లాగేస్తోంది. మెల్లగా లేచింది. భర్త నాగరాజు అప్పటికే లేచి తయారవసాగాడు.

" ఈరోజు నాకు పొద్దున్నే డ్యూటీ ఉంది కుమారీ, తొందరగా కాఫీ ఇచ్చేస్తే ఎల్లిపోతాను, నాకేమీ భోజనం వద్దు ఈ రోజుకి" అన్నాడు.

పాచిముఖంతోనే కాఫీ నీళ్ళు పడేసి నీళ్ళు పట్టుకోవడానికి వెళ్ళింది. ఆదివారం కనక పిల్లలని పొద్దున్నే లేపే పని లేదు. నీళ్ళు ఆగిపోకముందే ఇంట్లో ఉన్న నాలుగు డ్రమ్ములూ, ఆరు బకెట్లలోనూ నీరు పట్టేసి, కాఫీ కలిపి ఇచ్చి, భర్తని పంపించి గబ గబా ముఖం కడుక్కుని పొయ్యి మీద మూకుడు పెట్టి హడావిడిగా ఉప్మా చేసింది. అప్పటికే చల్లారిపోయిన తన కాఫీ ఒక్క గుక్కలో తాగేసి, స్నానం అయిందనిపించి తయారయి, నిద్రలో కదులుతున్న కూతురిని తట్టి లేపి..

" రాధీ, నేను వెళ్తున్నాను, తలుపు వేసుకుంటావా లేచి? ఆదివారం కదా కాసేపు పడుకోండి మళ్ళీ. తమ్ముడు లేచాకా ఇద్దరూ కలిసి టిఫిన్ తిని, స్నానాలు చెయ్యండి" అంది నెమ్మదిగా...

" ఈ రోజు ఆదివారం కదమ్మా, నువ్వు పనికి వెళ్ళడం మానేయవచ్చు కదా? "అడిగింది కూతురు రాధిక.

“తొందరగానే వచ్చేస్తానమ్మా, ఆదివారం కదా "అంది కుమారి చెప్పులు వేసుకుంటూ..

"ఏం టిఫిన్? "అంది బద్ధకంగా రాధిక..

" ఉప్మా" చెప్పేసి తలుపు వేసి బయటపడింది కుమారి.

"మళ్ళీ ఉప్మానా?, " విసుగ్గా అనుక్కుంది రాధిక. తప్పదన్నట్టు లేచి తలుపు లోపలనించి వేసుకుని మళ్ళీ మంచమ్మీద వాలింది బద్ధకంగా.

"నన్నే ఎప్పుడూ నిద్రలేపి తలుపు వేసుకోమంటుంది. వీడినెప్పుడూ లేపదు, ఏదైనా అడిగితే చిన్నవాడు అంటుంది " అని కోపంగా అనుకుంటూనే, చెదిరిపోయిన తమ్ముడి దుప్పటి సరిచేసి, తనూ నిద్రలోకి జారిపోయింది.

తలుపు వేసిన కుమారి పరుగులాంటి నడకతో పక్కవీధిలో ఉన్న అపార్ట్ మెంట్ వైపుకి నడిచింది.

నాలుగో అంతస్థుకి వెళ్ళి పదో నెంబర్ ఇంటి బెల్ కొట్టింది. తలుపు తెరిచింది ఆ ఇంటావిడ సాధన.

" వచ్చావా కుమారీ! ఇప్పుడే అనుకుంటున్నా ఇంకారాలేదేమమని? నీకు తెలుసుగా మీ భయ్యాకి ఒక్క క్షణం కూడా అటూ ఇటూ అవకూడదు దినచర్య... గబ గబా ఆలు పరాఠాలు చేసెయ్యి బ్రేక్ ఫాస్ట్ కి. పెద్దబాబు ట్యూషన్ కి వెళ్ళిపోవాలి ముందు అందరికీ చాయ్ చేసెయ్యి. పాల పేకెట్లు కిచెన్ లో గట్టు మీదే పెట్టాను" అంది త్వరగా..

" పాల పేకెట్ల లోంచి పాలు గిన్నెలో పోసి పొయ్యిమీద పెట్టి ఉండచ్చు కద, ఈ పాటికి కాగుతూ ఉండేవి" అనుకుంది కుమారి నీరసంగా. ఎందుకో ఈ మధ్యన ఆమెకి ఒంట్లో అంత హుషారుగా ఉండడం లేదు. ఎంత లిఫ్ట్ లో తిరిగినా ఆ అపార్ట్మెంట్ లో ఇళ్ళ మధ్యన తిరగడానికి కూడా అలసటగా అనిపిస్తోంది.

" సరే అక్కా, ఆలుగడ్డలు ఉడికించారా?" అంది.

" అబ్బే, లేదు.. నువ్వు కుక్కర్ లో పెట్టేసి ఈ లోపున పిండి కలుపుకో" అనేసి ఆవిడ పిల్లలని నిద్ర లేపడానికి వెళ్ళిపోయింది.

కుమారి ఆవిడ చెప్పినట్టే ఒక చిన్న కుక్కర్ లో ఆలుగడ్డలు ఉడికించడానికి పెట్టి, మరో రెండు పొయ్యిల మీద పాలూ, నీళ్ళూ కాచడానికి పెట్టింది. స్టీల్ బేసిన్ లో పిండి వేసుకుని నీళ్ళు పోసి కలిపింది. కుక్కర్ పని ముగిసేలోపున మధ్యాహ్నం వంటకి కావలసిన కూరలు తరుగుదామని ఆవిడని అడగడానికి వెళ్ళింది. ఆవిడ కనిపించలేదు బెడ్ రూములో. మళ్లీ తిరిగి కిచెన్ కి వచ్చింది.అప్పటికి పాలు కాగడంతో టీ కలిపి ఐదు కప్పుల్లో పోసి తీసుకెళ్ళి అందరికీ ఇచ్చేసి వచ్చింది. సాధన భర్త రోజూ ఉదయాన్నే రెండు కప్పుల టీ తాగుతాడు పేపర్ చదువుకుంటూ. అది కూడా రెండు వేరు వేరు కప్పుల్లో ఇవ్వాలి, ఒక పెద్ద కప్పులో ఇస్తే కుదరదు.

ఆపైన కుక్కర్ ఆపేసి ఆలుగడ్డలు వలిచి మసాలా వేసి కలిపి త్వరగా పరాఠాలు చేసింది. " రాత్రి ఉడికించి ఉంచుకుంటే తేలిక కదక్కా!" అంటే ఆవిడ ఒప్పుకోదు. " అన్నీ ఫ్రెష్ గా ఉండాలి మాకు" అంటుంది. 'మనిషి ని పెట్టుకుని, డబ్బు ఇస్తున్నాం కదా!" అన్నది అసలు ఉద్దేశ్యం. అందుకే ఒక్క పని కూడా చేసుకోదు, అన్నీ కుమారి వెళ్ళి చెయ్యాల్సిందే, పైగా అన్నీ టైము ప్రకారం జరగాలంటుంది. అంతే కాదు ఆ ఇల్లూ, ఈ ఇల్లూ చేరి కుమారి బోల్డు సంపాదిస్తోంది అంటూ ఉంటుంది తన స్నేహితులతో

పని మధ్యలో ఉండగా కుమారి ఫోన్ మోగింది. కూతురు

" అమ్మా, తమ్ముడు ఉప్మా తిననంటున్నాడు, రోజూ అదేనా? అని ఒకటే గొడవ" అంది.

పన్నెండేళ్ళ ఆ పిల్లకి తమ్ముడినెలా సముదాయించాలో తెలియడం లేదు. కుమారికి పని తెమలడంలేదు, ఇంకా రెండిళ్ళకి వెళ్తే గానీ, ఈ పూటకి పని పూర్తి కాదు. సహనం కోల్పోకుండా, ఫోన్ తమ్ముడికివ్వమని కూతురికి చెప్పి వాడిని సముదాయించేసరికి మరో ఐదు నిమిషాలు పట్టింది. ఈ లోపున పొయ్యిమీద పరాఠా కొంచం మాడింది.

ఎప్పుడు వచ్చిందో సాధన " ఫోన్లలో కూర్చుంటే పని తెమలదు, పరాఠాలు మాడిపోతాయి" అంటూ ఎగతాళి చేసింది. ఫోన్ ఆపేసి పనిలో పడింది కుమారి. మరొక అరగంటలో టిఫిన్ తయారయింది. ఇంటిల్లిపాదీ తిన్నారు, కుమారిని ఎవరూ అడగలేదు, ఆమెకి తినేంత టైము లేదు. అప్పటికే ఆలస్యమయిందని మరో రెండిళ్ళనిం చి ఫోన్ లు వచ్చాయి.

అక్కడనించి. అదే అంతస్థులో ఉన్న విజయ అనే ఆవిడ ఇంటికి వెళ్ళింది పరుగున.

" అంత పెద్ద మంటలో పెట్టి వంట చేస్తే వంట లో రుచి ఉండదు, అందుకే గాస్ సిలెండర్ నెల రోజులు కూడా రావడం లేదు, వేస్ట్ ఎక్కువ అవుతోంది" అంది విజయ కుమారి పెద్దగా పెట్టిన మంట తగ్గిస్తూ..

"నెమ్మదిగా పెట్టి చేస్తూ ఉంటే పని తెమలడం లేదక్కా, అందుకే ఇప్పుడే కొద్దిగా మంట పెంచాను" అంది కుమారి కూర కలుపుతూ..

" ఎలా తెములుతుంది? ఒకటికొకటి చేర్చి ఎన్ని ఇళ్ళు ఒప్పుకున్నావు? మనిషివా? మిషన్ వా చెయ్యడానికి?" అంది విజయ సానుభూతిగా..

" ఏం చేయనక్కా? అందరూ చాలా కాలంగా తెలిసినవాళ్ళు, ఎవరింట్లోనూ మానుకోలేకపోతున్నాను" అంది.

" మానలేకపోవడం కూడా కాదులే, డబ్బులు కూడా కావాలి కదా " అంది విజయ.

"ఆ మాటా నిజమే అక్కా, కాదనడమెందుకు? బిడ్డలు పెద్దవాళ్ళవుతున్నారు, పెరిగే అవసరాలు" అంది కుమారి కొంత స్వగతంగానూ, కొంత ప్రకాశంగానూ.

సాంబార్ కోసమని కూరలు తరుగుతున్న కుమారి మనసు గతంలోకి తొంగిచూసింది.

అనంతపురం దగ్గరున్న కదిరి దగ్గరున్న పల్లెటూరు కుమారి వాళ్ళది. చిన్నప్పుడే మేనమామ కొడుకు నాగరాజుతో పెళ్ళి చేశారు ఆమెకి. అప్పుడు తొమ్మిదో క్లాస్ చదువుతోందేమో, చదివినది చాల్లే అన్నారు తండ్రీ, బావా కూడా..

" అమ్మ దగ్గరుండి పని నేర్చుకో, ఇప్పటివరకూ ఉల్లిగడ్డ చెక్కు తీయడం కూడా రాదు నీకు" అని వెక్కిరించాడు నాగరాజు పెళ్ళయిన కొత్తలో నే.

అప్పటించీ చేయడానికి తగినంత పని లేక కొంత, స్వతహాగా ఉన్న ఉత్సాహంచేత కొంతా ఇంటిపనీ, వంటపనీ నేర్చుకోసాగింది.. ముఖ్యంగా వంట, చాలా కొద్దికాలంలోనే అన్నీ వంటలూ ఎంతో రుచిగా చెయ్యడం నేర్చుకుంది.

" ఈ పల్లెటూళ్ళో మేము పనులు చేసుకొనుడు చాల్లే బిడ్డా! మీరన్నా పట్నం పోయి సుఖంగా ఉండండి. నేను ఇట్లా చెప్పినానని మరొక తీరుగా అనుకోకు నానా, నా మాటిని పెద్దొరికి పోయి పని సూసుకో " అని తండ్రే దగ్గరుండి పంపగా బెంగుళూరులో అడుగుపెట్టాడు నాగరాజు.

వారం రోజులు తండ్రి స్నేహితుడింట్లో ఉన్నాడు, అతను చూపించగా ఒకరింట్లో డ్రైవర్ గా కుదిరాడు. పన్నెండువేలు జీతం, మధ్యాహ్నం భోజనం అని వినగానే మొదట చాలా బావుందనిపించింది కానీ ఆ మహానగరం లో బ్రతకాలంటే అది ఏ మూలకీ చాలదని భార్యా పిల్లలు వచ్చాకే అర్ధం అయిందతనికి. సిటీకి వచ్చామన్న ఆనందం కుమారికి కూడా ఎక్కువ కాలం నిలవలేదు.

" ఇక్కడుంటే బాధ్యత తెలియకుండా తిరుగుతున్నాడమ్మా, అందుకే అక్కడకు పంపినా, నీకేమైనా కావాలంటే మా దగ్గరనుంచి తీసుకుపో బిడ్డా" అని చెప్పాడు వచ్చేముందు మామ కుమారికి. ఆ మాట గుర్తున్నా కానీ ఆయన్ని అడగడానికి అభిమానం అడ్డు వచ్చింది ఆమెకి. పెద్దవయసులో ఉన్న వారికి తాము సహాయం చెయ్యాలి కానీ, అక్కడనించి ఆశించకూడదు అనుకునేది ఆమె. వర్షాలు పడీ, పడకా రైతులని ఏడిపించే ఆ కరువు సీమలో కష్టపడుతున్న అత్తామామలని బాధపెట్టడం అస్సలు ఇష్టం లేదామెకి.

అందుకే దగ్గరలోని అపార్ట్ మెంట్ లో పనికి వెళ్ళే పక్కింటి లక్ష్మి " నువ్వు వంటలు బాగా చేస్తావు కదా, నేను పనిచేసే అమ్మకి వంట చేయడానికి మనిషి కావాలట, నువ్వు చెయ్యకూడదూ, ఊరికే ఖాళీగా ఉండే బదులు నాలుగు రూపాయలు ఇంటికి తెచ్చుకోవచ్చుకదా!" అనగానే ఆలోచించింది.

"ఎప్పుడూ ఎక్కడా పని చెయ్యలేదు, ఇంట్లో అత్తా, మావా ఏమంటారో? ఒక్క తెలుగు తప్పితే మరో భాష రాదు, డబ్బులా, కావాలి. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు," ఇలా సాగాయి ఆమె ఆలోచనలు.

"వాళ్ళింట్లో పెద్దవాళ్ళిద్దరూ, ఉద్యోగం చేస్తున్న వారి అమ్మాయి మాత్రమే ఉంటారు. ఆ అమ్మ ఇదివరకులా పనిచేయ లేకపోతోంది, రెస్ట్ తీసుకోవాలని వాళ్ళ అమ్మాయి కోరిక. నాకేం పెద్ద పని ఉంది? అంటుందా అమ్మ. అయినా కూతురు వినడంలేదు నువ్వు వచ్చి మాట్లాడి ఒక నెల చేసి చూడు. ఇద్దరికీ నచ్చితేనే ఉండవచ్చు, లేదంటే ఆ పైనే మానేయవచ్చు" అని లక్ష్మి చెప్పిన సలహా కుమారికి బాగా నచ్చింది.

నాగరాజు కూడా మొదట సంధేహించినా, దగ్గరే కావడం వల్లనూ, ఇంట్లో, నీడ పట్టునుండి చేసేది కనకనూ ఒప్పుకున్నాడు. అలా మొదలయింది కుమారి ఉద్యోగం.

మొదట ఒప్పుకున్నది ఆ ఒక్క ఇల్లే, పొద్దున్నే వెళ్ళి టిఫిన్, మళ్ళీ పదకొండు గంటలకి వెళ్ళి రెండుపూటలకీ కలిపి వంటా, చేసి రావడం, అంతే. రాత్రికి అన్నం వాళ్ళే పెట్టుకునేవారు. ఐదువేలు జీతం లక్ష్మే మాట్లాడింది. అదనంగా ఐదువేలు వచ్చేసరికి ఎంతో వెసులుబాటుగా అనిపించింది భార్యాభర్తలిద్దరికీ.

ఆ ఇంటి పెద్దావిడ సుశీలమ్మగారు చాలా మంచిది, కుమారిని కూడా స్వంత కూతురిలాగే చూసుకునేది. ఎప్పుడూ పిల్లలకి ఏదో ఒకటి కొనివ్వడం, "ఇంటికి వెళ్ళి మళ్ళీ ఏం చేస్తావు? ఇదే కూర కాస్త ఎక్కువ చేసి కొంచం నువ్వు తీసుకుపో" అనడం ఇలా ఎంతో బాగా ఉండేది ఆవిడ ప్రవర్తన.

మొదట అనుకున్న ఒక నెలలోనే ఆవిడకెంతో ప్రీతిపాత్రమైపోయింది కుమారి. కుమారి ఎంత బాగా పనిచేస్తుందో, వంటిల్లంతా ఎంత శుభ్రంగా ఉంచుతుందో అపార్ట్ మెంట్ లో అందరికీ చెప్పేది సుశీలమ్మ. చాలా నమ్మకస్థురాలు, ఒక్క పుల్ల కూడా ఎటూ పోదు అంటూ ఆవిడ చెప్పేసరికి సహజంగానే వంటమనిషి కోసం చూస్తున్న వారందరూ కుమారిని తమ ఇంట్లో పనికోసం అడగసాగారు.

" నువ్వు చిటికెలో చేసేస్తావు కదా, పిల్లలు స్కూల్లో ఉన్న టైము చూసుకుని అప్పుడు చేస్తానని చెప్పు, డబ్బుంటే ఎదుగుతున్న పిల్లకి నగా, నట్రాకైనా పనికొస్తుంది కదా" అన్న లక్ష్మి మాటలు మంత్రంలా పనిచేశాయి కుమారి మీద.

" నిజమే కదా" అనుకుంది.

దానివల్ల సుశీలమ్మ ఇంటికి తోడు మరో రెండు ఇళ్ళు తోడయ్యాయి. మరొక నెలకి కొత్తగా పెళ్ళయిన ఒకమ్మాయి కుమారిని పిలిచి..

" వంట చేయడంటే నాకిష్టం కానీ కావలసినవన్నీ ప్లాన్ చేసుకోవడమే కష్టం, అందుకని వారానికి రెండు సార్లు వచ్చి కూరగాయలన్నీ తరిగి డబ్బాల్లో పోసి ఫ్రిజ్ లో పెట్టేయడం, వంటకి కావలసిన మసాలాలు, చారు పొడీ, సాబారు పొడి లాంటివీ అవి చేసి పెడితే నెలకు రెండు వేలు ఇస్తాను, చేస్తావా?" అని అడిగింది.

'సులువుగా అయిపోతుంది కదా' అని అదీ ఒప్పుకుంది. ఈ లోపున రోజూ రాత్రి పూట చపాతీలు చేసుకోవడం కష్టం గా ఉంది, వచ్చి ఉత్త చపాతీలు మాత్రం చేసి పెట్టమని ఒకళ్ళిద్దరు అడిగారు. స్వతహాగా మెతకస్వభావం కలదైన కుమారి ఎవరికీ లేదని చెప్పలేకపోయింది. దాంతో ఆమె పనికి ఒప్పుకున్న ఇళ్ళ సంఖ్యా, తద్వారా రాబడీ రెండూ పెరిగాయి.

ఒకప్పుడు భర్తనీ, పిల్లలనీ పంపి పక్కవారితో కబుర్లాడుకుంటూ, కొత్తగా కొన్న టీ.వీలో సీరియళ్ళు చూసుకుంటూ హాయిగా కాలం గడిపే కుమారికి ఇప్పుడు ఉరుకులూ, పరుగుల జీవితమైపోయింది.

" అమ్మా, వస్తున్ననమ్మా, ఇదిగో పిల్లలిప్పుడే పోతాఉండారు"

" అమ్మ ఇంట్లో పని అయిపోయిందక్కా, వెంటనే నీ ఇంటికే వస్తా"

" ఇంకో నాలుగు రొట్టెలు ఎక్కువ చెయ్యాలా అక్కా, సరే లే చేసిపెడతా మీరు ఆఫీసు నించి వచ్చేసరికి"

" వస్తూ కూరగాయలు తేవాలా? సరేలే అమ్మా, నాకు తెచ్చుకుంటాగదా, అప్పుడే తెస్తాలే" ఇలా ఆమె ఫోన్ సంభాషణలు ఆగకుండా సాగేవి.

ఎంత పరుగులు, ఉరుకులతో చేసినా ఒక్కోసారి పని తెమిలేది కాదు. మొదట పిల్లలు స్కూళ్ళో ఉన్నవేళలోనే పని చేసే ఆమెకి ఇప్పుడు మధ్యాహ్నం ఒక గంటసేపు కూడా ఇంట్లో గడిపే సమయం దొరకడం లేదు. 'ఖాళీగా కూర్చుని ఎన్నిరోజులయిందో?' అనిపిస్తోంది. ఎవ్వరింట్లోనూ పనివేళకంటే ఒక్క నిమిషం కూడా అదనంగా ఉండదు, అయినా సరే!

పొద్దున్న కుదిరితే ఉప్మానో, ఎప్పుడైనా ఇడ్లీయో చెయ్యడం అదీ కుదరకపోతే పిల్లలనే మేగీ చేసుకోమనడం, మధ్యాహ్నం దొరికిన టైములో ఓ కూరా, అన్నం వండడం కంటే మరేమీ చెయ్యలేకపోతోంది ఇంట్లో. ఎవరింట్లోనైనా మిగిలినవి తీసుకెళ్ళమని ఇస్తే అదీ లేదు. ఒక్కోసారి రాత్రి లేట్ అయితే పిల్లలు, నాగరాజు ఉన్నదేదో తినేసి పడుకుంటారు. నెలకు పాతికవేలకు పైన వస్తున్న సంపాదన చూస్తూ చూస్తూ మానుకోలేకపోతోంది.

పిల్లలతో ఇదివరటిలా గడపకలేకపోతున్నాను, ఇదంతా అవసరమా అనిపించినప్పుడు " ఇదంతా వాళ్ళ బాగుకోసమే కదా! లేకపోతే నాకెందుకీ డబ్బు?" అనుకుని మనసుని సరిపెట్టుకోవడం మొదలైంది. ఇలా ఆలోచనల్లోనే పని ముగించి సాంబార్ లో వేగిన పోపు వేసి " పని అయిపోయిందక్కా, వస్తాను" అంటూ మరొక మాటకవకాశమివ్వకుండా బయటపడింది.

తను వెళ్ళాల్సిన మూడో ఇంటివారు ఆపూట ఊరు వెళ్ళడంతో, 'అమ్మయ్యా' అనుకుని ఇంటికి బయలుదేరింది. ఇంతలో విజయ వెనక్కి పిలిచి నిన్న రాత్రి మిగిలిపోయిన కూరా, పప్పూ తీసుకెళ్ళమని డబ్బాలు ఇచ్చింది.

" ఈ రోజు మధ్యాహ్నం కాసేపు నడుం వాల్చచ్చు" అనుకుంటూ అవి తీసుకుని ఇంటిదారి పట్టింది.

ఇల్లు చేరుతూనే అలసటగా, మంచమ్మీద కూర్చుంది కుమారి. పిల్లలిద్దరూ స్నానాలు చేశారా, లేదా? తిన్నరా, లేదా? అని కనుక్కుని కాసేపు వారితో కబుర్లు చెప్పినతర్వాత కానీ తాను పొద్దున్నించీ ఏమీ తినలేదని గుర్తొచ్చింది. ప్లేట్ లో ఉప్మా పెట్టుకుంది కానీ తనకే తినాలనిపించలేదు " రోజూ ఉప్మానేనా?" రాధిక మాటలు గుర్తొచ్చాయి. డబ్బాలో పెట్టి మూత పెట్టేసింది

" అమ్మా ఈ రోజు ఆదివారం కదా, స్పెషల్ ఏమిటి?" అడిగాడు కొడుకు రఘు

" ఇదిగో పప్పూ, కూరా ఉన్నాయి, పది నిమిషాల్లో కుక్కర్ లో అన్నం పెట్టేస్తాను. వేడిగా ముగ్గురం కలిసి తిందాం, ఆ తర్వాత టీ.వీ లో సినిమా చూద్దాం సరేనా" అంది సంతోషంగా.

" వద్దు" అన్నాడు వాడు చిరాగ్గా..

'ఎందుకు వద్దు?" అంది వాడిని దగ్గరకు తీసుకుంటూ..

" రోజూ వారింట్లోవీ, వీరింట్లోవీ తినడం చిరాకమ్మా, నువ్వు ఏదైనా వండచ్చు కదా" అంది రాధిక.

పక పకా నవ్వింది కుమారి. "ఎవరింట్లోవైనా నేను చేసిన వంటే కదా! నిన్న రాత్రి వంట ఎంత బావుందో! అని విజయాంటీ ఇంట్లో అందరూ ఎంత మెచ్చుకున్నారో తెలుసా?" అంది..

"నువ్వు ఎక్కడో చేసిన వంట కాదమ్మా, మనింట్లో వంట చెయ్యమ్మా, మంచిది, రుచికరమైనది. ఎన్ని రోజులయిందో నువ్వు మనింట్లో వేడిగా చేసిన వంట తిని. అందుకని ఈరోజు, ఈ ఒక్కరోజు మనింట్లో, మనకోసం వంట చేయవూ! నీకేదిష్టమైతే అదే, కష్టమైనది అక్కరలేదు." అంది రాధి..

అప్పుడొచ్చింది, అలసిపోయిన కుమారికి ఆపుకోలేనంత దుఃఖం. జలజలా రాలాయి కన్నీళ్ళు. ఒప్పుకున్న ఇళ్ళల్లో బాగా వంట చేసి మెప్పు పొందాలన్న తాపత్రయంలో తన వంటింటికి తానెంత దూరమైందో? తెలిసింది కుమారికి. అమాయకంగా అడుగుతున్న కూతురి అందమైన ముఖం చూస్తూ ఉంటే తనపిల్లల కోరికలెంత చిన్నవో అర్థం అయిందామెకి

తల్లి ఎందుకేడుస్తోందో తెలియలేదు రాధికి. " ఏమయిందమ్మా?" అంది భయంగా.

" ఏమీ లేదురా, తప్పకుండా చేసుకుందాం, ఈ రోజు చక్కగా బిర్యానీ చేస్తాను మనందరికీ సరేనా ?" అంది పిల్లలనిద్దరినీ దగ్గరకు తీసుకుంటూ..

Click here to share your comments on this story